ఒక్కరోజులోనే శతశాతం పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్, జూలై 29: ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఆగస్టు ఒకటో తేదీ నాడే శతశాతం పంపిణీ చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గతంలో ఎదురైన సమస్యలు పునరావృతం కాకూడదని స్పష్టం చేశారు. మునిసిపల్ కమిషనర్లు, మండల అభివృద్ధి అధికారులు ముందురోజు బ్యాంకుల నుంచి నగదును విత్‌డ్రా చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పింఛను పంపిణీ కార్యక్రమంలో సచివాలయ, అన్ని శాఖల సిబ్బంది పాల్గొనాలని ఆదేశించారు.



మాటిచ్చి.. నిలబెట్టుకుని..!

- ప్రభుత్వ ఇంటర్ కళాశాలలకు పుస్తకాలు
- త్వరలో విద్యార్థులకు పంపిణీ
- నెరవేరనున్న మంత్రి లోకేశ్ హామీ
- వైసీపీ పాలనలో గాడితప్పిన విద్య
- కూటమితోనే లబ్ధి అని.. తల్లిదండ్రుల హర్షం

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

ఐదేళ్ల తర్వాత ఇంటర్మీడియట్ విద్యకూ.. విద్యార్థులకు మంచి రోజులొచ్చాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇంటర్ విద్య.. తల్లిదండ్రులకు ఆర్థికభారమైంది. తొలి ఏడాది అరకొరగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసింది. తర్వాత నాలుగేళ్లూ పుస్తకాల ఊసే లేదు. బయట పుస్తకాలు కొనుగోళ్లు చేద్దామన్నా దొరకని పరిస్థితి ఎదురైంది. దీంతో ఇంటర్ విద్య గాడి తప్పింది. ఈ నేపథ్యంలో ఇంటర్ విద్యను గాడిలో పెట్టాలని ప్రస్తుత ఎన్డీయే కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్సులు, బ్యాగు అందజేయనుంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు జిల్లాకు చేరుకోగా.. త్వరలో పంపిణీ ప్రక్రియ ప్రారంభించనున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 38 ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి సుమారు 20వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రతి విద్యార్థీ.. ఉన్నత విద్యను అభ్యసించాలంటే ఇంటర్మీడియట్ కీలకం. కాగా.. చాలామంది తల్లిదండ్రులు ఫీజుల భారం భరించలేక వారి పిల్లలను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించారు. వైసీపీ పాలనలో నాలుగేళ్లు.. ఒక్క పుస్తకం కూడా ఇంటర్ విద్యార్థులకు పంపిణీ చేయలేదు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తప్పలేదు. ఒక్కో విద్యార్థికి ఏడాదికి రూ.5వేల వరకూ పుస్తకాల కోసం ఖర్చు చేసి ఇబ్బందులు పడేవారు. ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్ర, పలు ప్రచార కార్యక్రమాల్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్.. ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక ప్రకటన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఇంటర్ విద్యార్థులకు పుస్తకాలతోపాటు బ్యాగ్‌ను సైతం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం హామీని నెరవేర్చే దిశగా మంత్రి లోకేశ్ చర్యలు చేపట్టారు. పుస్తకాల పంపిణీకి ఆమోదముద్ర వేశారు. ఈ మేరకు జిల్లాకు పుస్తకాలు చేరుకున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో ఒక్కో విద్యార్థికి పాఠ్యపుస్తకాలతో పాటు ఆరేసి చొప్పున వైట్, రూల్ నోట్స్, బ్యాగుతో సహా పంపిణీ చేయనున్నారు. త్వరలో నియోజకవర్గాల వారీ ఎమ్మెల్యేలతో పుస్తకాల పంపిణీ చేపట్టనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో పుస్తకాలు పంపిణీ చేస్తామని ఆర్ఐవో ప్రగడ దుర్గారావు తెలిపారు.

● 2014-2019 కాలంలో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజన పథకం అమలు చేసింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని నిలిపేసింది. పుస్తకాల సంగతే మరిచింది. మళ్లీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంటర్ విద్యార్థులకు మహర్దశ లభించనుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందమే..

ఇంటర్మీడియట్ పుస్తకాలను బయట కొనుగోలు చేయాలంటే సుమారు రూ.5వేలు వరకు ఖర్చవుతోంది. ఆర్థిక స్తోమత కలిగినవారు ప్రైవేటు కళాశాలల్లో చేరుతుంటారు. మాలాంటివారికి ప్రభుత్వ కళాశాలలే దిక్కు. ఆర్థిక భారం లేకుండా ప్రభుత్వం ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేస్తామని ప్రకటించడం ఆనందంగా ఉంది.

-కె.సురేష్, విద్యార్థి, ఆమదాలవలస

మెడికల్ సీట్ల పేరుతో మోసం

- కజకిస్థాన్‌లో చేర్పిస్తామని నమ్మించి.. దోపిడీ
- ఆరేళ్ల ఫీజులు, హాస్టల్‌కు ఒకేసారి రూ.లక్షల్లో వసూలు
- కానీ.. ఒక్క ఏడాదికే చెల్లించిన ఏజెంట్
- విద్యార్థుల అవస్థలపై ఎస్పీకి బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు



ఎస్పీ కార్యాలయం వద్ద.. బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల ఆవేదన

శ్రీకాకుళం క్రైం, జూలై 29: వైద్య విద్యార్థులే లక్ష్యంగా.. మెడికల్ సీట్ల పేరిట ఓ ఘనుడు నమ్మించి మోసం చేశాడు. కజికిస్థాన్‌లోని యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదువు కోసం ఫీజుల రూపంలో రూ.లక్షల్లో గుంజేశాడు. ఆ డబ్బులు యూనివర్సిటీకి సక్రమంగా చెల్లించక పోవడంతో విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దేశంకాని దేశంలో పడరాని పాట్లు పడుతూ.. స్వగ్రామానికి చేరుకున్నారు. మోసపోయామని గ్రహించిన బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం శ్రీకాకుళంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు.. కరీంనగర్‌కు చెందిన గంగాధర్ హరీష్.. శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపాన యాతపేటలో జీబీఎస్ ఇంటర్నేషనల్ కార్యాలయాన్ని 2022లో ప్రారంభించాడు. ఎంబీబీఎస్ చదువుకుందామనుకునే విద్యార్థులను టార్గెట్ చేసి.. వారి నుంచి రూ.లక్షల్లో వసూలు చేశాడు. 8 మంది విద్యార్థులకు కజకిస్థాన్ దేశంలోని ఓ మెడికల్ యూనివర్శిటీలో మెడిసిన్ సీట్లు ఇప్పిస్తానని నమ్మించాడు. ఆరేళ్ల ఫీజు, హాస్టల్, భోజన సౌకర్యాల నిమిత్తం ఒక్కొక్కరి నుంచి రూ.28 లక్షల నుంచి రూ.48 లక్షల చొప్పున రూ.2 కోట్లకుపైగా వసూ లు చేశాడు. ఆ 8 మంది విద్యార్థుల ను కజకిస్థాన్‌లోని కళాశాలలో చేర్పించి.. ఒక ఏడాది ఫీజు లు, వసతి, భోజనానికి నగదు చెల్లించాడు. కానీ, రెండో ఏడాది నుంచి ఫీజులు చెల్లించలేదు. దీంతో అక్కడ విద్యార్థులను హాస్టల్ నుంచి వెళ్లగొట్టారు. కళాశాలకు రానివ్వలేదు. ఈక్రమంలో ఏజెంట్ గంగాధర్ అసలు బాగోతం బయట పడింది. దీనిపై విద్యార్థులు గంగాధర్‌ను నిలదీయగా.. ఆయన బెదిరింపులతోపాటు దాడులకు పాల్పడ్డాడు. దీంతో వారంతా జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు వివరించారు. కజకిస్థాన్ పోలీసులతో పాటు ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశారు. తర్వాత అక్కడి నుంచి ఆ ఎనిమిది మంది జిల్లాకు వచ్చేశారు. తామంతా మోసపోయామని తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డికి ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయాలని కోరగా.. ఎస్పీ వారికి భరోసా ఇచ్చారు.

న్యాయం చేయండి..

మాకు వ్యవసాయమే జీవనాధారం. మా కుమారుడ్ని వైద్యుడిని చేయాలనే ఉద్దేశంతో ఎంబీబీఎస్ చదివించాలనుకున్నాం. ఈ క్రమంలో గంగాధర్ హరీష్‌తో పరిచయమైంది. ఇండియాలో మెడిసిన్ చేయాలంటే రూ.కోట్లు ఖర్చవుతుందని చెప్పాడు. అదే కజకిస్థాన్‌లో అయితే ఎంబీబీఎస్ సీటు, హాస్టల్, భోజనం ఖర్చులతోపాటు కాలేజీ ఫీజులకు రూ.25లక్షలు కడితే చాలని నమ్మించాడు. దీంతో 2022లో అప్పు చేసి మరీ దశలవారీగా గంగాధర్‌కు రూ.25 లక్షలు ఇచ్చాం. ఒక ఏడాది సక్రమంగానే ఫీజు చెల్లించాడు. కానీ, రెండో ఏడాది నుంచి ఫీజులు చెల్లించకపోవడంతో నా కుమారుడు రోడ్డున పడ్డాడు. దిక్కుతోచక అక్కడ నుంచి ఇంటికి తిరిగొచ్చేశాడు. మోసపోయిన మాకు న్యాయం చేయాలి.

-కొర్నాన అప్పలనాయుడు, రోళ్లపాక, బొండపల్లి మండలం, విజయనగరం జిల్లా

విద్య దక్కలేదు.. అప్పుల పాలయ్యాం

మా ఇద్దరి పిల్లలకు కజకిస్థాన్‌లో ఎంబీబీఎస్ సీటు, హాస్టల్, భోజనం, ఆరేళ్లపాటు ఫీజుల కోసం గంగాధర్‌కు రూ.45లక్షలు అప్పు చేసి చెల్లించాం. ఒక ఏడాది ఫీజుల కింద రూ.3.60 లక్షలు మాత్రమే ఆయన కట్టాడు. రెండవ ఏడాది ఫీజులు చెల్లించలేదు. అడిగితే కజకిస్థాన్‌లో పిల్లలపై దాడికి పాల్పడ్డాడు. దాడి విషయంపై అక్కడి పోలీసులకు, ఇండియన్ ఎంబసీకి ఫిర్యాదు చేశాం. ఇప్పుడు విద్యా దక్కలేదు. అప్పుల పాలైపోయాం. పోలీసులే న్యాయం చేయాలి.

-దుప్పల దుర్గారావు, కుశాలపురం, ఎచ్చెర్ల మండలం, శ్రీకాకుళం

● పోలాకి మండలం దల్లయ్యవలసకు చెందిన బోర అప్పోజి నుంచి రూ.28.50 లక్షలు, శ్రీకాకుళం నగరానికి చెందిన అన్నెపు నానాజీరావు నుంచి రూ.25 లక్షలు, రాజాం మండలం కొత్తవలసకు చెందిన ఒన రమణ నుంచి రూ.28.50 లక్షలు, కుశాలపురానికి చెందిన పైడి అప్పల సూర్యనారాయణ నుంచి రూ.25 లక్షలు గంగాధర్ హరీష్ ఎంబీ బీఎస్ సీట్ల పేరుతో వసూలు చేశాడు. ఆయా బాధితులంతా న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగికి..
వృద్ధాప్య పింఛన్

- వైసీపీ పాలనలో.. రెండేళ్ల నుంచీ లబ్ధి
- తాజాగా బయటపడిన అక్రమాలు



(వజ్రపుకొత్తూరు)

ఆయనో విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి. గృహ నిర్మాణ శాఖలో ఏఈగా విధులు నిర్వహించి.. సుమారు మూడేళ్ల కిందట ఉద్యోగ విరమణ పొందారు. ప్రభుత్వం నుంచి పెన్షన్ తీసుకుంటున్న ఆయన దృష్టి.. సామాజిక పింఛన్‌పై కూడా పడింది. స్థానిక వైసీపీ నాయకుడి సహకారంతో తెల్ల రేషన్ కార్డు పొందాడు. ఆపై వృద్ధాప్య పింఛన్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైంది. గత రెండేళ్ల నుంచీ ఇటు ప్రభుత్వ పెన్షన్, అటు వృద్ధాప్య పింఛన్‌ను దర్జాగా పొందుతున్నారు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో ఈ అక్రమాల వ్యవహారం బయటపడింది. వివరాల్లోకి వెళితే..

● వజ్రపుకొత్తూరు మండలం పూండి గోవిందపురంలో నివసిస్తున్న ఓ రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి.. నిబంధనలకు విరుద్ధంగా సామాజిక పింఛన్ పొందుతున్నారు. నందిగాం మండలానికి చెందిన ఈయన పూండిలోనే నివాసం ఏర్పరచుకున్నారు. గతంలో వజ్రపుకొత్తూరు, పలాస, మందస, కవిటి మండలాల్లో గృహ నిర్మాణశాఖలో వర్క్ఇన్‌స్పెక్టర్‌గా, ఏఈగా విధులు నిర్వహించారు. మూడేళ్ల కిందట పదవీ విరమణ చెందగా.. ప్రభుత్వ పెన్షన్ రూ.50వేల వరకూ వస్తోంది. కాగా.. పదవీ విరమణ తర్వాత ఆయన స్థానిక వైసీపీ నేత సహకారంతో తెల్లరేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకున్నారు. కొన్నిరోజుల తర్వాత రేషన్‌కార్డు మంజూరైంది. కాగా.. ఓ వైపు ప్రభుత్వ పింఛన్ పొందుతున్న ఆయనకు రేషన్‌కార్డు మంజూరు కావడం గమనార్హం. ఆయన అంతటితో ఆగలేదు. నిరుపేదలకు అందించే సామాజిక వృద్ధాప్య పింఛన్‌పై దృష్టి పెట్టారు. ఈ పింఛన్‌కు రేషన్‌కార్డే ప్రథమ ప్రామాణికం కావడంతో.. దరఖాస్తు చేసుకున్నారు. ఆపై మళ్లీ వైసీపీ నేతను కలిసి.. పింఛన్ మంజూరు చేయించుకున్నారు. గత రెండేళ్ల నుంచి ప్రతినెలా రూ.3వేలు చొప్పున పింఛన్ పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత నెల కూడా ఎరియర్స్‌తో కలిపి రూ.7 వేలు పింఛన్ నగదు పొందారు. కాగా.. వైసీపీ పాలనలో పింఛన్ల అక్రమాలు భారీగా జరగడంతో కూటమి నేతలు వీటిపై దృష్టి సారించారు. ఈ క్రమంలో విశ్రాంతి ఉద్యోగి.. సామాజిక పింఛన్ పొందుతున్న బండారం వెలుగుచూసింది. తప్పుడు ధ్రువపత్రాలతో ఆయన పింఛన్ పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు దీనిపై పూర్తిస్థాయిలో విచారణ చేపడితే.. మరిన్ని నిజాలు బయటపడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. విశ్రాంత ఉద్యోగికి అసలు రేషన్‌కార్డు ఎలా మంజూరు చేశారనే దానిపై కూడా దర్యాప్తు చేయాలని కోరుతున్నారు. దీనిపై ఎంపీడీవో డి.తిరుమలరావు వద్ద ప్రస్తావించగా.. ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు సామాజిక పింఛన్లకు అర్హులు కారని తెలిపారు. ఎవరైనా పింఛన్లు తీసుకున్నట్లు మా దృష్టికి వస్తే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

● మత్స్యకార భరోసాలో కూడా..

2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో 50 ఏళ్లకే మత్స్యకార పింఛన్ మంజూరు చేశారు. ఇదే అదనుగా వైసీపీ పాలనలో గత ఐదేళ్ల నుంచి కొన్ని గ్రామాల్లో మత్స్యకార కుల ధ్రువపత్రాలు పొంది కొంతమంది అక్రమంగా పింఛన్లు పొందుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గునుపల్లి పంచాయతీలో నలుగురు మత్స్యకార కులానికి చెందనివారు తప్పుడు ధ్రువపత్రాలతో లబ్ధి పొందుతున్నారనే విమర్శలున్నాయి. ఈ విషయమై ఇప్పటికే స్థానిక టీడీపీ నాయకులు.. అధికారులకు ఫిర్యాదు చేశారు. చాలా గ్రామాల్లో పింఛన్ల వ్యవహారంలో అక్రమాలు కొనసాగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటిపై అధికారులు స్పందించి విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు బయటపడతాయి.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పనిచేద్దాం.. లక్ష్యాలు సాధిద్దాం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కలెక్టరేట్, జూలై 29: 'జిల్లాలో సమస్యలు పరిష్కరించి ప్రగతిని సాధించాలి. వివిధ సమస్యలపై అందిన అర్జీలకు నాణ్యతతో కూడిన సత్వర పరిష్కారం చూపాల'ని సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీ కోసం'లో ఆయన పాల్గొని.. అర్జీదారుల నుంచి 200 వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ శ్రద్ధ, అంకితభావంతో పనిచేసి.. లక్ష్యాలను సాధించి జిల్లాను ఉన్నత స్థానంలో నిలపాలని స్పష్టం చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో ఎం.గణపతిరావు, డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, జడ్పీ సీఈవో వేంకటేశ్వరరావు, ఉప కలెక్టర్ సుదర్శన దొర, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, డీఎంహెచ్‌వో బి.మీనాక్షి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజ్యలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, బీసీ సంక్షేమాధికారి అనూరాధ, డ్వామా పీడీ చిట్టిరాజు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా నిలవాలి

కలెక్టరేట్, జూలై 29: వ్యవసాయరంగ అభివృద్ధికి అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని, అన్నదాతలకు అండగా నిలవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో వ్యవసాయం, హార్టికల్చర్, సెరికల్చర్, పశు సంవర్థక శాఖ, ఫిషరీస్, మార్కెటింగ్, కోపరేటివ్, బ్యాంకర్లు తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'జిల్లాలో వ్యవసాయ శాఖ ద్వారా అందించే ఎరువులు, విత్తనాలు, వ్యవసాయాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలి. క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలి. ఈ ఏడాది జిల్లాలో 1,82,325 హెక్టార్లలో వివిధ పంటల సాగు లక్ష్యం. ఇందులో వరి 1,51,500హెక్టార్లు, మొక్కజొన్న 10,000 హెక్టార్లలో ప్రధానంగా సాగు చేయాలి' అని తెలిపారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు పంపిణీ చేశామని వ్యవసాయాధికారి శ్రీధర్ తెలిపారు. అలాగే పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 2.29 లక్షల మంది రైతులకు రూ.45.8కోట్లు జమ చేశామన్నారు. పలు శాఖల లక్ష్యాలు, సాధించిన ప్రగతి, సిబ్బంది పనితీరుపై కలెక్టర్ ఆరా తీశారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, పశుసంవర్థక శాఖ జేడీ జయరాజు, మత్స్య శాఖ డీడీ శ్రీనివాసరావు, మార్క్‌ఫెడ్ డీఎం రమణి, సెరికల్చర్ అధికారి రాజేంద్రప్రసాద్ బాబు, ఉద్యానవన అధికారి ప్రసాదరావు, మార్కెటింగ్ ఏడీ గంగాధర్, డీసీసీబీ సీఈవో వరప్రసాద్ పాల్గొన్నారు.

ఆగిన 'మీ-సేవ'లు

- కేంద్రాల్లో నిలిచిన కార్యకలాపాలు
- రెండు వారాలుగా పనిచేయని సర్వర్లు
- సర్టిఫికెట్ల కోసం విద్యార్థుల ఇక్కట్లు

(కంచిలి/ ఇచ్ఛాపురం)

'మీ-సేవ' కేంద్రాల్లో ప్రభుత్వ సేవలు గత రెండు వారాల నుంచి నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయంగా సచివాలయాల్లో ఆశించిన మేరకు సేవలు అందడం లేదు. ప్రధానంగా విద్యా సంవత్సరం ఆరంభం కావడంతో.. వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం విద్యార్థులు ఇక్కట్లకు గురవుతున్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే అక్కడ నుంచి వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్, ఆర్డీవో లాగిన్ వరకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. దీంతో ధ్రువపత్రాల మంజూరులో జాప్యమవుతోంది.

● వైసీపీ పాలనలో గడ్డుపరిస్థితి

ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ అనేక సేవలు అందించిన 'మీ-సేవ' నిర్వాహకుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు సజావుగా అమలయ్యేలా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు.. మీ-సేవ సర్వీసులు ప్రారంభించారు. మొదట్లో ఆరు సేవలు అందేవి. తర్వాత టీడీపీ హయాంలో సీఎం చంద్రబాబు మీ-సేవలను బలోపేతం చేస్తూ.. 330 సర్వీసులకు పెంచారు. 2017-18లో రూ.5 ఉండే కమీషన్‌ను రూ.10కి పెంచారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీ-సేవ నిర్వాహకులకు కష్టాలు మరింత పెరిగాయి. సచివాలయాలకు 'మీ-సేవ'లను బదలాయించడంతో నిర్వహణ కష్టమవుతోందని వాపోతున్నారు. కనీసం విద్యుత్ బిల్లులు, నెట్‌చార్జీలు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో చాలాచోట్ల మీ-సేవ కేంద్రాలు మూతపడ్డాయి. ఉమ్మడి జిల్లాలో 652 మీ సేవా కేంద్రాలు ఉండేవి. ఏపీ ఆన్‌లైన్ సెంటర్లు 54, రామ్ ఇన్‌ఫో సెంటర్లు 36, సీఎంఎస్ 562 కేంద్రాలు నిర్వహించేవారు. జిల్లాలో రోజుకి ఒక్కో కేంద్రం నుంచి వందకుపైగా లావాదేవీలు జరిగేవి. నిర్వాహకులతోపాటు ఆపరేటర్లు, సహాయకులు ఉపాధి పొందేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహణ భారంతో 338 కేంద్రాలు మూతపడ్డాయి. ప్రస్తుతం 314 కేంద్రాలు మాత్రమే కొనసాగుతున్నాయి. ప్రస్తుతం రోజుకు ఒక్కో మీ-సేవ కేంద్రంలో పది లావాదేవీలు కూడా జరగడం లేదని నిర్వాహకులు పేర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తమను ఆదుకోవాలని మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

బకాయిలే కారణమా?

జిల్లాలోని మీసేవ కేంద్రాల్లో.. ఏపీ ఆన్‌లైన్, రామ్‌ఇన్‌ఫో, సీఎంఎస్‌లు సర్వీస్ ప్రొవైడర్లుగా ఉన్నారు. ఈ మూడు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వానికి బకాయి పడినట్లు తెలిసింది. దీంతో రెండు వారాల కిందట ప్రభుత్వం మీసేవా కేంద్రాల సర్వీసులను నిలిపివేసింది. ఆయా సంస్థలు కలెక్టర్‌ల వద్దకు వెళ్లి ప్రభుత్వానికి బకాయిలు ఏమీ లేవని ఎన్‌వోసీలు తెచ్చుకుంటేనే సర్వీసులు పునరుద్ధరిస్తామని చెప్పినట్లు సమాచారం. ఆయా సంస్థలు ఎన్‌వోసీలు తెచ్చుకోవడంలో జాప్యం చేస్తుండడంతో సేవలు నిలిచాయి. ఒక్కో కేంద్రంలో సగటున రోజుకు మూడు వందలకుపైగా సేవలను ప్రజలు వినియోగిస్తున్నారు. కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణతో పాటు విద్యుత్, ఆస్తి, నీటి పన్నులు, ఆర్‌టీఏ, రిజిస్ట్రేషన్, రెవెన్యూ, నెట్‌బిల్లులు, పోలీసు వెరిఫికేషన్ సర్టిఫికెట్లు, లేబర్ శాఖ, విద్యుత్ మీటర్లు, ఇంటి మీటరుకు పేరు మార్పులు తదితర సేవల కోసం వీటికే ఎక్కువగా వెళ్తుంటారు. సర్వీసు చార్జీలు చెల్లించి.. నిర్ణీత తేదీకి సర్టిఫికెట్లను పొందుతారు. ఈ సేవలన్నీ నిలిచిపోవడంతో ప్రజలు అసహనం చెందుతున్నారు.



ఇచ్ఛాపురం : పంజావీధి జంక్షన్‌లో నెట్ సెంటర్ వద్ద నిరీక్షణ

మీ సేవ

సులభంగా, వేగంగా

సేవలు పునరుద్ధరించాలి

మీసేవ కేంద్రాల సేవలు త్వరితగతిన పునరుద్ధరించాలి. గతంలో 650కుపైగా కేంద్రాలు ఉండేవి. ప్రస్తుతం దాదాపు 300 కేంద్రాలు మాత్రమే పనిచేస్తున్నాయి. సర్వీసులు పనిచేయక మీసేవా కేంద్రాల నిర్వహణ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఉంది. కొంతమంది నిర్వాహకులు ఆదాయం లేక కూలి పనులకు వెళ్లిపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సమస్య పరిష్కరించాలి

- ఏ.రవికుమార్, మీ-సేవ కేంద్రాల జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్

ఆంధ్ర వర్సిటీలో ఎంబీఏ, ఎంసీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- ఎంబీఏ, ఎంసీఏ ఫుల్ టైం ప్రోగ్రామ్‌లలో సెల్ఫ్ సపోర్ట్ మోడ్ కేటగిరీ సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఏపీఐసెట్ 2024 ర్యాంక్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. సీట్లు మిగిలిన పక్షంలో అకడమిక్ ప్రతిభ ఆధారంగా అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారు. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు ట్యూషన్ ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తించదు. స్కాలర్‌షిప్‌లు లభించవు.

ఎంబీఏ

ఎంబీఏ జనరల్ ప్రోగ్రామ్‌తోపాటు మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హెచ్‌ఆర్ స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. హెచ్‌ఆర్ స్పెషలైజేషన్‌లో 66 సీట్లు; మిగిలిన వాటిలో ఒక్కోదానిలో 44 సీట్లు ఉన్నాయి. ఎంబీఏ(జనరల్, హెచ్‌ఆర్) ప్రోగ్రామ్‌లను ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్‌ఐబీ); మిగిలిన స్పెషలైజేషన్ ప్రోగ్రామ్‌లను ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్(డీసీఎంఎస్) అందిస్తున్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.1,50,000

ఎంసీఏ

ఏయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 66 సీట్లు ఉన్నాయి.

అర్హత: కనీసం 50% మార్కులతో బీసీఏ/బ్యాచిలర్ డిగ్రీ ఇన్ కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు; మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా ఇంటర్‌తోపాటు బీఎస్సీ/బీకాం/బీఏ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.1,25,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **కౌన్సెలింగ్ ఫీజు:** రూ.600
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **కౌన్సెలింగ్ తేదీ:** ఆగస్టు 14
- **కౌన్సెలింగ్‌కు తీసుకురావాల్సిన పత్రాలు:** ఏపీ ఐసెట్ 2024 ర్యాంక్ కార్డ్; టీసీ; పదోతరగతి, ఇంటర్/డిప్లొమా, డిగ్రీ సర్టిఫికెట్లు, మార్కుల పత్రాలు; తొమ్మిదో తరగతి నుంచి డిగ్రీ వరకు స్టడీ సర్టిఫికెట్లు; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** డైరెక్టర్, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్, ఆంధ్ర యూనివర్సిటీ, విజయనగరం ప్యాలెస్, పెదవాల్తేర్, విశాఖపట్నం-530017
- **వెబ్‌సైట్:** https://audoa.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yArgvZGలో చదవండి.

దిక్సూచి DIKSUCHI

హైదరాబాద్‌లోని డా. బీ.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్ఏఓయూ)- గ్రాడ్యుయేట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, డిప్లొమా, సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు స్టడీ సెంటర్లు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు తమకు అనువైనదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్‌లలో భాగంగా కాంటాక్ట్ తరగతులు, ల్యాబొరేటరీ సెషన్స్, అసైన్‌మెంట్స్, వార్షిక పరీక్షలు ఉంటాయి. ఆలిండియా రేడియో ద్వారా నిర్ణీత సమయాల్లో రేడియో పాఠాలు ప్రసారం చేస్తారు.



● డిగ్రీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి మూడేళ్లు. బీఏ, బీకాం, బీఎస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. బీఏ, బీకాం కోర్సులకు ఏదేని గ్రూపుతో ఇంటర్ ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్(సైన్స్) గ్రూప్ అభ్యర్థులు అర్హులు. తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ నుంచి పన్నెండో తరగతి ఉత్తీర్ణులు; పదోతరగతి తరవాత రెండేళ్ల ఐటీఐ/ఒకేషనల్ కోర్సులు చేసినవారు, మూడేళ్ల పాలిటెక్నిక్ డిప్లొమా ఉత్తీర్ణులూ దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులు ఇంగ్లీష్ లేదా తెలుగు మాధ్యమాన్ని ఎంచుకోవచ్చు. బీఏ(పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, హిస్టరీ), బీఎస్సీ(బోటనీ, కెమిస్ట్రీ, జువాలజీ) కోర్సులు ఉర్దూమీడియంలో కూడా అందుబాటులో ఉన్నాయి.

బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(బీఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. దీనిని తెలుగు/ఇంగ్లీష్ మాధ్యమంలో చదువుకునే వీలుంది. ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ పూర్తిచేసినవారు; ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు రికార్డు అసిస్టెంట్‌గా ఏడాది అనుభవం లేదా డిప్లొమా/సర్టిఫికెట్ కోర్సు(లైబ్రరీ సైన్స్) పూర్తిచేసినవారు అర్హులు.

● డిప్లొమా ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఏడాది. స్పెషలైజేషన్‌కు నిర్దేశించిన విధంగా సంబంధిత/ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

స్పెషలైజేషన్‌లు: సైకలాజికల్ కౌన్సెలింగ్, మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, ఇంటర్నేషనల్ రిలేషన్స్, ఉమెన్ స్టడీస్, హ్యూమన్ రైట్స్, కల్చర్ అండ్ హెరిటేజ్ టూరిజం.

హ్యూమన్ రైట్స్ ప్రోగ్రామ్‌ను తెలుగు మాధ్యమంలో, మిగిలినవాటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

● పీజీ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి రెండేళ్లు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లు ఉన్నాయి. ఎమ్మెస్సీ, ఎంకాం, ఎంఏ(జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లను ఆంగ్ల మాధ్యమంలో; లాంగ్వేజ్ ప్రోగ్రామ్‌లు మినహా అన్నింటినీ తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

ఎంఏ స్పెషలైజేషన్‌లు: జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, సోషియాలజీ, ఇంగ్లీష్, తెలుగు, హిందీ, ఉర్దూ.

ఎమ్మెస్సీ స్పెషలైజేషన్‌లు: మేథమెటిక్స్, అప్లయిడ్ మేథమెటిక్స్, సైకాలజీ, బోటనీ, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, ఫిజిక్స్, జువాలజీ.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో సంబంధిత డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లాంగ్వేజెస్‌లో ఎంఏ కోర్సుకు డిగ్రీలో సంబంధిత లాంగ్వేజ్‌ని సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. ఎంకాం కోర్సుకు బీబీఏ/బీబీఎం/బీఏ(కామర్స్) అభ్యర్థులూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఎమ్మెస్సీ (మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్) కోర్సుకు మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎమ్మెస్సీ సైకాలజీకి ఏదేని డిగ్రీ పాసైతే చాలు.

మాస్టర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్(ఎంఎల్ఐఎస్సీ) కోర్సు వ్యవధి ఏడాది. ఇంగ్లీష్ మాధ్యమంలో మాత్రమే ఈ కోర్సు ఉంది. కనీసం 40 శాతం మార్కులతో బీఎల్ఐఎస్సీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

● సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌లు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. విభాగాన్ని అనుసరించి పదో తరగతి/ఇంటర్ ఉత్తీర్ణులు అర్హులు.

విభాగాలు: ఎన్‌జీఓస్ మేనేజ్‌మెంట్, ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, లిటరసీ అండ్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్.

● ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌ను ఆంగ్ల మాధ్యమంలో, మిగిలినవాటిని తెలుగు మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 18
- **వెబ్‌సైట్:** www.braou.ac.in

నవ్య | చిత్రజ్యోతి

పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ చిత్ర పరిశ్రమ సోమవారం సమావేశమై కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంది. వీటిల్లో ప్రధానమైంది, తెలుగు నిర్మాతలు సాహసించి తీసుకోలేనిది ఏమిటంటే .. ఇకపై హీరోలు, హీరోయిన్లకు ముందుగా అడ్వాన్సులు ఇవ్వకూడదన్నది. కొంతమంది నటీనటులు, టెక్నీషియన్లు నిర్మాతల నుంచి అడ్వాన్స్‌లు తీసుకుని సినిమాలకు డేట్స్ ఇవ్వకుండా ఆ తర్వాత ఒప్పుకొన్న చిత్రాలకు వర్క్ చేస్తున్నారు. ఇకపై అలా కాకుండా మొదట ఎవరివద్ద అడ్వాన్స్‌లు తీసుకున్నారో వారి షూటింగ్ పూర్తి చేసిన తర్వాతే కొత్త సినిమా షూటింగ్‌లో పాల్గొనాలి. తమిళంలో ఈ నిర్ణయాన్ని అమలు చేయగలరేమో కానీ తెలుగులో సాధ్యమయ్యే పనేనా అనే చర్చ తెలుగు చిత్ర పరిశ్రమలో మొదలైంది. ఎందుకంటే ప్రముఖ సంస్థలు పెద్ద హీరోలకు అడ్వాన్సులు ఇవ్వడం, వారు తీసుకోవడం సహజంగా జరిగేదే. ఇలా అడ్వాన్స్ ఇచ్చిన వెంటనే ఆ సినిమా మొదలవుతోందా అంటే చాలా సందర్భాల్లో లేదనే చెప్పాల్సి ఉంటుంది. కథ కుదరకో, కాంబినేషన్ సెట్ అవకో సినిమాలు ప్రారంభం కావడానికి లేట్ కావచ్చు. ఆ లేట్ అనేది నెలలు కావచ్చు, సంవత్సరాలు కావచ్చు. ఏళ్ల తరబడి వెయిట్ చేసినా చివరకు జరగని సందర్భాలు ఉన్నాయి కూడా. ఈ లోపు అన్నీ సెట్ అయిన వేరే సినిమా మొదలుపెట్టేస్తుంటారు హీరోలు. హీరోలకు ఇచ్చిన అడ్వాన్సులకు వడ్డీలు కడుతూ లోలోపల బాధ పడుతుంటారు తప్ప బయటకు వ్యక్తం వ్యక్తం చేయలేని పరిస్థితి. ఎందుకంటే ఎప్పటికైనా హీరోగారు కరుణించి డేట్స్ ఇవ్వవచ్చనే ఓ ఆశ వారిని సంవత్సరాల తరబడి వెయిట్ చేసేలా చేస్తుంటుంది. అలాగే ఒక సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, ఓ వారం రోజుల పాటు షూటింగ్ చేసో, లేక కొంత భాగం షూట్



చేసిన తర్వాత ఆ సినిమాను అలా పక్కన పెట్టేసి మరో కొత్త చిత్రం చేసే హీరోలు తెలుగు చిత్రపరిశ్రమలోనూ ఉన్నారు. ఇలాంటి విషయాలపై తెలుగు చిత్ర పరిశ్రమ కూడా కఠిన నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడిస్తుంటుంది కానీ అవి ఆచరణకు దూరంగానే ఉంటున్నాయి. ఇటువంటి నేపథ్యంలో తమిళ నిర్మాతలమండలి తీసుకున్న నిర్ణయాలు రేకెత్తిస్తున్నాయి. తెలుగులో కూడా ఇలాంటి కఠిన నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందని నిర్మాతల మనసులో ఉంది కానీ పిల్లి మెడలో గంట కట్టేది ఎవరు?

తమిళ నిర్మాతల మండలి నిర్ణయాలు ఇవే

అధ్యక్షుడు ఎస్.మురళి నేతృత్వంలో సభ్యులు సోమవారం వివిధ సంఘాలకు చెందిన నిర్వాహకులు, ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించారు. ఇందులో పలు తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

- ఆగస్టు 16 తర్వాత కొత్త సినిమాల షూటింగ్ మొదలు పెట్టకూడదు. ప్రస్తుతం చిత్రీకరణలో ఉన్న సినిమాలన్నీ అక్టోబరు 31 లోపు పూర్తి చేయాలని ఆయా చిత్ర బృందాలకు సూచించింది.
- పెండింగ్‌లో ఉన్న చిత్రాలు, ఇచ్చిన అడ్వాన్స్‌లపై నివేదిక అడిగిన నిర్మాతల మండలి.
- నవంబరు ఒకటినుంచి ఎలాంటి సినిమాల చిత్రీకరణ చేపట్టకూడదు.
- ఇప్పటికే చిత్రీకరణ పూర్తయి విడుదలకు నోచుకోని చిత్రాల పరిస్థితి ఒక కొలిక్కి వచ్చేంత వరకు ఆగస్టు 16 నుంచి కొత్త సినిమాలేవీ చిత్రీకరణ మొదలుపెట్టకూడదు.
- నటీనటులు, సాంకేతిక నిపుణులు జీతభత్యాలు పెంచుకుంటూ పోతున్నారని, ఖర్చులకు ఒక విధానమంటూ లేకపోయిందని, ఈ అంశాలపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్మాతలమండలి అభిప్రాయపడింది. వీటిని క్రమబద్ధీకరించడంతో పాటు సరైన ప్రణాళికతో ముందుకుసాగాలని, అందువల్ల నవంబరు ఒకటో తేదీ నుంచి ఏ ఒక్క సినిమా షూటింగ్ జరగరాదని తీర్మానించింది.
- అగ్రనటులు నటించే కొత్త చిత్రాలను ఎనిమిది వారాల తర్వాతే ఓటీటీలకు ఇవ్వాలని తీర్మానించింది.


-ఆంధ్రజ్యోతి, చెన్నై



ధనుష్ పై ఆగ్రహం

హీరో ధనుష్‌పై తమిళ నిర్మాతల మండలి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈయన ఆరు చిత్ర నిర్మాణ సంస్థల నుంచి అడ్వాన్స్‌లు తీసుకున్నారని, ఇలా అడ్వాన్సులు చెల్లించిన మిగిలిన నిర్మాతలు కూడా అసోసియేషన్‌తో మాట్లాడి తమ పనులు మొదలు పెట్టాలని సూచన చేసింది. ఇకపై నిర్మాతల మండలి అనుమతి ఉంటేనే ధనుష్ చిత్రాలకు గ్రీన్ సిగ్నల్ లభిస్తుంది. అయితే ధనుష్ ఇప్పుడు తెలుగులో రెండు చిత్రాల్లో నటిస్తున్నారు కనుక ఈ నిర్ణయాల ప్రభావం ఆయన మీద అంతగా ఉండక పోవచ్చు.

కంటి చికిత్స కోసం అమెరికాకు?



బాలీవుడ్ నటుడు షారూఖ్‌ఖాన్ అత్యవసర కంటి చికిత్స కోసం అమెరికా వెళ్తున్నట్లు బాలీవుడ్ మీడియాలో వినిపిస్తోంది. ఆయన కంటి సమస్యతో సోమవారం ముంబైలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా, అక్కడి వైద్యులు అమెరికా వెళ్లాలని సూచించినట్లు సమాచారం. దీంతో నేడు షారూఖ్ అమెరికా వెళ్లనున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వార్తలపై షారూఖ్ పీఆర్ బృందం ఇంతవరకూ స్పందించలేదు. 2014లో షారూఖ్ కంటికి శస్త్ర చికిత్స జరిగింది. ఆయన ప్రస్తుతం కింగ్ చిత్రంలో నటిస్తున్నారు.

మూర్ఖులను గెలవలేము



ఆరోగ్యానికి సంబంధించిన చిట్కాలను అభిమానులతో పంచుకున్న సమంత వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. తాజాగా నయనతారకు ఇలాంటి అనుభవమే ఎదురైంది. తనకు ఆసక్తిగా అనిపించిన పలు విషయాలను సోషల్ మీడియాలో అభిమానులతో పంచుకుంటున్నారు. ఈ క్రమంలో ఆమె మందార పువ్వులతో చేసిన టీ అంటే తనకు ఎంతో ఇష్టమని ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తెలిపారు. దీనివల్ల రోగ నిరోధక శక్తి పెరగడంతో పాటు పలు దీర్ఘ కాలిక వ్యాధుల నుంచి ఉపశమనం దొరుకుతుందని నయనతార పేర్కొన్నారు. ఫాలోవర్స్‌ను నయనతార తప్పుదోవ పట్టిస్తున్నారని, ఆమె చెప్పినదాంట్లో నిజం లేదని కొంతమంది వైద్యులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె తన పోస్ట్‌ను తొలగించారు. 'మూర్ఖులతో వాదనకు దిగొద్దు. మీరు గెలవలేరు. మిమ్మల్ని కూడా వారి స్థాయికి దిగజార్చి ఓడిస్తారు' అనే మార్క్ ట్వైన్ సూక్తిని షేర్ చేశారు. తనను విమర్శించిన వారిని ఉద్దేశించి ఆమె ఈ పోస్ట్ పెట్టారని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

సీనియర్ సినీ నిర్మాత సూర్యనారాయణబాబు కన్నుమూత



సీనియర్ నిర్మాత, మహేశ్‌బాబు మేనమామ ఉప్పలపాటి సూర్యనారాయణ బాబు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో కన్నుమూశారు. సూపర్‌స్టార్ కృష్ణకు బావ అయిన సూర్యనారాయణ బాబు 'మనుషులు చేసిన దొంగలు', రామ్ రాబర్ట్ రహీమ్', 'సంధ్య', 'బెజవాడ రౌడీ' తదితర చిత్రాలు నిర్మించారు. రాజకీయాల్లోకి ప్రవేశించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుడివాడ నియోజక వర్గం నుంచి ఎన్టీఆర్ పై పోటీ చేసి ఓడిపోయారు. నటుడు విజయ్‌చందర్‌తో కలిసి ఎన్టీఆర్‌కు వ్యతిరేకంగా 'కలియుగ విశ్వామిత్ర' చిత్రాన్ని కూడా నిర్మించారు. సూర్యనారాయణ బాబు పార్థివ దేహాన్ని మంగళవారం ఉదయం కోకాపేటలోని మూవీ టవర్స్‌లో ఉంచి, ఆ తర్వాత మహా ప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు చెప్పారు.



తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ తమ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని దర్శక సంజీవని పేరుతో ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హీరో విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్, ఉపాధ్యక్షుడు సాయి రాజేశ్, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా..



ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న 'రాజా సాబ్' చిత్రం నుంచి సోమవారం అప్డేట్ వచ్చింది. ప్యాన్ ఇండియా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ప్రభాస్ వింటేజ్ లుక్‌లో చార్మింగ్‌గా కనిపించారు. రొమాంటిక్ హారర్ జానర్‌లో ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఇప్పటికే 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. ఆగస్టు 2 నుంచి మరో భారీ షెడ్యూల్ ప్రారంభించనున్నారు.

చిత్రం: రాజాసాబ్
ప్రొడ్యూసర్: టీజీ విశ్వ ప్రసాద్
డైరెక్టర్: మారుతి
బ్యానర్: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ
నటీనటులు: నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్, యోగిబాబు తదితరులు

ఆగస్టులో భవనమ్



కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందిన హారర్ కామెడీ 'భవనమ్'. ఆగస్టు 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించింది. నటుడు సప్తగిరి మాట్లాడుతూ 'సూపర్ గుడ్ ఫిల్మ్స్ బేనర్‌లో ఓ సినిమా చేయాలనే కల 'భవనమ్'తో నెరవేరింది' అన్నారు. ఇందులో కామెడీ యాక్షన్ సాంగ్స్ ప్రేక్షకులను అలరిస్తాయని షకలకశంకర్ చెప్పారు. సినిమాను చాలా గ్రిప్పింగ్‌గా తెరకెక్కించాం, ప్రేక్షకులను అలరిస్తుందని దర్శకుడు బాలాచారి తెలిపారు.

చిత్రం: భవనమ్
ప్రొడ్యూసర్: ఆర్‌బీ చౌదరి, వాకాడ అంజన్ కుమార్, వీరేంద్ర సీర్వి
డైరెక్టర్: బాలాచారి కూరెళ్ల
బ్యానర్: సూపర్‌గుడ్ ఫిల్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్
నటీనటులు: సప్తగిరి, ధన్‌రాజ్, షకలక శంకర్, తాగుబోతు రమేశ్, మాళవిక సతీషన్ తదితరులు

ఉషా పరిణయ గాథ



ఇంటిల్లిపాదిని ఆకట్టుకునే ప్రేమకథతో రూపొందిన చిత్రం 'ఉషా పరిణయం'. 'లవ్ ఈజ్ బ్యూటిఫుల్' అనేది ఉపశీర్షిక. ఆగస్టు 2న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు హీరో సాయిదుర్గ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త నటీనటీలతో రూపొందుతున్న ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, ఈ తరహా చిత్రాలు మరిన్ని వస్తాయి అని సాయిదుర్గతేజ్ అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'మా కుటుంబం మద్దతుతో ఈ చిత్రాన్ని నిర్మించాను. ధ్రువన్ మంచి సంగీతం అందించాడు' అన్నారు. అందరి సహకారంతో ఓ మంచి సినిమాను అందిస్తున్నాం, సినిమా చూస్తున్నప్పుడు ఎంజాయ్ చేస్తారు అని హీరో చెప్పారు. ఈ సినిమాతో నటిగా నాకు మంచి పేరు వస్తుందని హీరోయిన్ చెప్పారు.

చిత్రం: ఉషా పరిణయం
ప్రొడ్యూసర్: కె. విజయ్ భాస్కర్
డైరెక్టర్: కె. విజయ్ భాస్కర్
బ్యానర్: విజయ్ భాస్కర్ క్రాఫ్ట్ ప్రొడక్షన్
నటీనటులు: శ్రీ కమల్, తాన్వీ ఆకాంక్ష, సూర్య

బడ్డీ టికెట్ ధరల తగ్గింపు



అడ్వంచరస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'బడ్డీ'. ఆగస్టు 2న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో బడ్డీ సినిమా రేట్లను తగ్గిస్తున్నట్లు మేకర్స్ సోమవారం ప్రకటించారు. సింగిల్ స్క్రీన్లలో రూ. 99, మల్టీప్లెక్స్‌లో రూ. 125గా టికెట్ ధరలు నిర్ణయించారు. భారతీయ వెండితెరపైన ఒక సరికొత్త ప్రయోగంగా 'బడ్డీ' సినిమా నిలుస్తుందని ఈ సందర్భంగా మేకర్స్ తెలిపారు.

చిత్రం: బడ్డీ
ప్రొడ్యూసర్: కేఈ జ్ఞానవేల్ రాజా, అధన్ జ్ఞానవేల్ రాజా
డైరెక్టర్: శామ్ ఆంటోన్
బ్యానర్: స్టూడియో గ్రీన్ ఫిలింస్
కాస్టింగ్: అల్లు శిరీష్, గాయత్రి భరద్వాజ్, అజ్మల్ అమీర్, అలీ, ముఖేశ్ కుమార్ తదితరులు

శివారు భూములకు కళింగదళ్ నీరు

● ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం: శివారు భూములకు కళింగదళ్ రిజర్వాయర్ నుంచి సాగునీరు అందించ నున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. బుడా ర్సింగి వద్ద సోమవారం కళింగదళ్ కాలువ వద్ద కొబ్బరి కాయ కొట్టి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు 'ప్రతి చేనుకు నీరు.. ప్రతి చేతికి పని' అన్న సంకల్పంతో నేడు సాగు నీటి కోసం పనులు చేపడుతున్నామ న్నారు. కళింగదళ్ నుంచి వదిలే నీటితో మందస ఏజెన్సీలో సుమారు 3200 ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. గత ఐదేళ్ల లో మంత్రిగా ఉన్న వ్యక్తి వంశధార నీటిని శివారు ప్రాంతాలకు అదించలేదని, ప్రభుత్వం మారిన తరువాత నేడు ఒక్క నెలలోనే పలాస నియోజకవర్గానికి సాగునీరం దించి రైతు ప్రభుత్వంగా నిలిచిందన్నారు. రానున్న కాలంలో తన తండ్రి, మాజీ మంత్రి గౌతు శివాజీ కృషితో అభివృద్ధి చేసిన సాగునీటి వనరులను ఆధునికీకరణ చేసి రైతులకు అండగా నిలుస్తామని హామీ నిచ్చారు. కార్యక్రమంలో జలవనరులశాఖ డీఈఈ వెంకటరమణ, జేఈ మధు, టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్, బావన దుర్యోధన, రుక్మిణీ బిస్వాల్, తాతారావు, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్య, లబ్బ రుద్రయ్య నవీన్, సురేంద్ర, తిరుపతి, ఈశ్వర రావు, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.


కళింగదళ్ నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిరీష

పాతపద్ధతిలోనే సర్వీసును కొనసాగించాలి

పలాసరూరల్: పాత పద్ధతిలోనే ఇన్ సర్వీసు కోటాను కొనసాగించాలని పలాస డివిజన్ వైద్యాధికారులు కోరారు. ఈ మేరకు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గౌతు శిరీషకు సోమవారం అందించారు. గత ఐదేళ్లుగా సేవలందిస్తున్నామని, తాము విధుల్లో చేరినప్పుడు ఉన్న నిబంధనలను మార్పిడి చేసి మాకు అన్యాయం చేయవద్దన్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఎమ్మెల్యే శిరీష వారికి తెలిపారు.

ఎల్ఎన్‌పేటలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుచేయాలి

● ఎస్పీని కోరిన ఎమ్మెల్యే గోవిందరావు

శ్రీకాకుళం క్రైం/ఎల్.ఎన్.పేట/పాతపట్నం: లక్ష్మీనర్సుపేట మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ లేదని, తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ మహేశ్వర్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందించారు. అలాగే మెళియాపుట్టి పోలీస్ స్టేషన్ సిబ్బందికి వాహన సౌకర్యం లేకపోవ డంతో గ్రామాలకు సకాలంలో చేరుకోలేకపోతున్నారని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నియో జకవర్గంలోని మిగిలిన స్టేషన్లలో కాలం చెల్లిన వాహనాల స్థానంలో కొత్త వాహనాలను మంజూరు చేయాలని కోరారు. గంజాయి రవాణా, మత్తుపదార్థాల అక్రమ రవాణాపై స్పెషల్ డ్రైవ్ చేపట్టి యువత వాటికి బానిసలు కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.


ఎస్పీ మహేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఆర్బీకేకి దారేదీ?

సైరిగాం రైతు భరోసా (సేవా) కేంద్రానికి దారిలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండేళ్ల కిందట అప్పటి మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ఈ భవనాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఆ తరువాత ఈ కేంద్రానికి దారి ఏర్పాటు చేయక పోవడంతో నిరుపయోగంగా తయారైంది. ఆర్బీకేని వైసీపీ ప్రభుత్వం డిపట్టా భూమి లో నిర్మించింది. ఈ కేంద్రానికి ఎదురుగా ఉన్న డిపట్టా భూమి తనదని, సంబంధిత యజమాని కంచె ఏర్పాటు చేయడంతో ఆర్బీకేకు వెళ్లేందుకు మార్గం లేకుండా తయారైంది. దీనిపై సంబంధిత అధికారులు స్పందించకపోవడంతో లక్షలాది రూపాయలతో నిర్మించిన భవ నం నిరుపయోగంగా తయారైంది. సంబంధిత యజమానితో చర్చించి మార్గం ఏర్పాటు చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ఇన్‌చార్జి తహసీల్దార్ తిరుపతిరావు వద్ద ప్రస్తావించగా రికార్డులు పరిశీలించి రైతు భరోసా కేంద్రానికి మార్గం కల్పిస్తామన్నారు.

-జలుమూరు


రైతు భరోసా కేంద్రం ఎదుట ఏర్పాటు చేసిన కంచె

సర్వే త్వరితగతిన చేపట్టాలి

నరసన్నపేట: ఎల్సీడీసీ సర్వే, ఆన్‌లైన్‌లో నమోదును త్వరితగతిన చేపట్టాలని అడిష నల్ ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.తాడేల శ్రీకాంత్ సూచించారు. సోమవారం కోమర్తి, సత్యవరం ఉప ఆరోగ్య కేంద్రాల్లో చేపడు తున్న లెప్రసీ సర్వేని పరిశీలిం చారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన సర్వేలో 16 కేసులను గుర్తించామని, వారికి మల్టీడ్రగ్ థెరపీ (ఎండీటీ) చికిత్స అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ అధికారి వాన సురేష్, సూపర్‌వైజర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కోమర్తిలో సర్వేను పరిశీలిస్తున్న డా.శ్రీకాంత్

నరసన్నపేట కోర్టుకు 'మెండ' హాజరు

నరసన్నపేట: వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసినందుకు దేవాది వద్ద హైవేపై నిరసన చేపట్టిన తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు మెండ దాసునాయుడుతో నరసన్నపేట టీడీపీ నాయకులపై అప్ప టిలో పెట్టిన కేసులో సోమవారం వారు కోర్టుకు హాజరయ్యారు. అప్పటిలో వారిని అరెస్ట్ చేసి బెయిల్‌పై విడుదల చేశారు. ఈ కేసులో విచారణకు టీడీపీ నాయకులు బగ్గు గోవిందరావు, శిమ్మ చంద్ర శేఖర్, కింజరాపు రామారావుతో కలిసి కోర్టుకు హాజరయ్యారు.

సహకార సంఘ ఆస్తులను పరిరక్షించండి

పాతపట్నం: మండలంలో సుమారు రూ.7 కోట్ల విలువ చేసే సహకార సంఘ ఆస్తులను వైసీపీ నాయకుడు మంచు చంద్రయ్య అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, అతనిపై చర్యలు తీసుకుని ఆస్తులను వాటిని పరిరక్షించాలని కొరసవాడ గ్రామ చేనేత కార్మికులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. గత టీడీపీ ప్రభుత్వంలో జిల్లాలో 22 కామన్ ఫెసిలిటేట్ సెంటర్లను అప్పటి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మంజూరు చేశారని, వాటిలో కొరసవాడలోని శ్రీఉమాశంకర చేనేత సంఘానికి రూ.45 లక్షల వ్యయంతో సీఎఫ్‌సీ నిర్మించారన్నారు. ఆ భవన నిర్మాణం జరిగిన స్థలం సర్వే నెంబర్ 88-14లో 0.38 సెంట్ల ప్రభుత్వ భూమిని చంద్రయ్య తన పేరుతో 1బిలు మార్చుకొని దోపిడీకి పాల్పడ్డాడని ఫిర్యాదు చేశారు. అలాగే కార్మికులకు ప్రభుత్వాలు అందించే ఆర్థిక ప్రోత్సాహకాలను సైతం దోచుకున్నాడని, విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు ఆనెం రామారావు, కొల్ల పకీరు, జనగ అప్పారావు, బూడిది చిన్నారావు, కాకర్ల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

టెక్కలి: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని వచ్చేనెల 9న నిర్వహించనున్నట్లు ఆ సంఘ నాయకుడు వరహాల కృష్ణారావు తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఆది వాసీ హక్కుల సాధన, ఆదివాసీ రిజర్వేషన్లు, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సంఘాల నాయకులు, ఉద్యోగులు, మేధావులు, కళాకారులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో విశాఖరావు, షణ్ముఖరావు, శంకరరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పథకాల పేర్లు మార్చడం హర్షణీయం

సంతబొమ్మాళి: రాష్ట్ర విద్యాశాఖ అమలు చేస్తున్న పలు పథకాలకు పేర్లు మార్చడం హర్షణీ యమని ఏపీసీపీఎస్ఈఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డి సూరిబాబు అన్నారు. విద్యా కానుకకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రగా, మధ్యాహ్న భోజన పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం గా, ప్రతిభా పురస్కారాలకు అబ్దుల్ కలాం ప్రతిభా పురస్కారాలుగా పేర్లు మార్చి ఆదర్శంగా నిలిచారన్నారు. గత ప్రభుత్వంలో ఈ పథకాలకు అప్పటి సీఎం జగన్ తన పేరు పెట్టుకుని విద్యా వ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చారని ఆ ప్రకటనలో విమర్శించారు.

లంపీ స్కిన్ లక్ష్యాలను అధిగమించాలి

జలుమూరు: పశువులకు వేస్తున్న లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు గడువులోగా లక్ష్యాలను అధిగమించాలని పశువైద్యాధికారి ముద్దాడ దీప్తి అన్నారు. చల్లవానిపేట డెయిరీలో 80 పశువులకు సోమవారం లంపీస్కిన్ టీకాలు వేశారు. మండలంలో 9 వేల పశువులకు లంపీ స్కిన్ వ్యాధి నిరోధక టీకాలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 2 వేల పశువులకు వేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకురాలు లక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్‌లో స్థానం

టెక్కలి: వ్యవసాయ మార్కెట్ కమిటీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కోటబొమ్మాళికి చెందిన అవ్వా రామకృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం ప్రకాశం జిల్లా దర్శి మార్కెట్ కమిటీ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా కె.దుర్యోధనరావు, ఉపాధ్యక్షులుగా గౌరి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా రమేష్‌రెడ్డి, కోశాధికారిగా రమేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి: కాలేయ సంబంధిత వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కేంద్ర ఆసుపత్రి వైద్యుడు జి.లక్ష్మణ రావు అన్నారు. ప్రపంచ హెపటైటిస్ దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కాలేయ వ్యాధులు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.గోవిందమ్మ, అధ్యాపకులు జనార్దనరావు, సీహెచ్.సునాథన్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణరావు

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, కార్మిక రంగాలను అన్యాయం

అరసవల్లి: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, కార్మిక రంగానికి అన్యాయం జరిగిందని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) నాయకులు ఆరో పించారు. ఈ మేరకు కేంద్ర బడ్జెట్‌లో తగిన కేటాయింపులు లేకపోవడాన్ని వ్యతిరేకిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో శ్రీకాకుళం అంబేడ్కర్ జంక్షన్ వద్ద సోమవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. బడ్జెట్ ప్రతులను దహనం చేయడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి మోదీ ప్రభుత్వం మరోసారి అన్యాయం చేసిందని, పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు వేసి కార్పొరేట్లకు దోచిపెట్టేలా బడ్జెట్ ఉందని విమర్శించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, వెలమల రమణ, పి.ప్రసాద్, కె.సూరయ్య, టి.ప్రకాష్, పి.గోపి, ఎస్.కృష్ణవేణి, పి.చందు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. ● ఎచ్చెర్ల: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయానికి మరోసారి అన్యా యం చేశారని పేర్కొంటూ చిలకపాలెం జంక్షన్‌లో కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏపీ రైతు సంఘం, సీఐటీయూ, కౌలు రైతు సంఘం నాయకులు బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెలమల రమణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, టి.నందోడు, పి.కైలాస్, అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో నిరసన తెలుపుతున్న సంయుక్త కిసాన్ మోర్చా నేతలు

విత్తన బంతులతో వనాల అభివృద్ధి



తయారు చేసిన విత్తన బంతులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు


ట్రీ గార్డులను ఏర్పాటు చేసిన లయన్స్‌క్లబ్ సభ్యులు

పలాసరూరల్: విత్తన బంతులతో వనాలు అభివృద్ధి చెంది వన్యప్రాణుల సంరక్షణ ఉపయోగ పడుతుందని, ఉపాధ్యాయులు అన్నారు. బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్‌లో సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జాతీయ హరితదళం, జూని యర్ రెడ్‌క్రాస్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక జీవ వైవిధ్య కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బంక మట్టి, సేంద్రీయ ఎరువు, ఉసిరి, నేరేడు, పనస, అశోక, దేవ కాంచన తదితర విత్తనాలను కలగలిపి ఐదు వేల విత్తన బంతులను విద్యార్థులతో తయారు చేయించారు. వీటిని రహదారులకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాలు, కొండల్లో వెద జల్లుతామని, దీనిలోని ఎరువును ఉపయోగించుకుని మొక్కలు వృక్షాలై అడవులు తయారవుతాయన్నారు. తద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు జీవ వైవిధ్యం పెంపొందుతుందని ఉపాధ్యాయులన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ఎ.ఈశ్వరరావు, ఎన్‌జీసీ క్లస్టర్ కోఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడండి

పలాస: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని లయన్స్ క్లబ్ ప్రతి నిధులు అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా స్థానిక నెహ్రూ పార్కు వద్ద లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. క్లబ్ సభ్యుడు కేపీ రామన్న వితరణతో మొక్కలు నాటి ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని పరిరక్షించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు హెచ్‌వై దొర, కార్యదర్శి టి.మాధవరావు, కోశాధికారి ఎస్.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో అక్రమ తవ్వకాల పరిశీలన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 5వ వార్డు తాళభద్ర గ్రామ చెరువులో అక్రమ తవ్వకాలను రెవెన్యూ, మైన్స్ అధికారులు పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి'లో 'తవ్వేస్తున్నారు' శీర్షికతో వచ్చిన కథనానికి జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. తక్షణం పరిశీ లించి నివేదిక అందించాలని ఆదే శించారు. ఈనేపథ్యం లో సోమవారం ఆర్‌ఐ నిరంజన్, వీఆర్వో కె.ఖగేశ్వర రావు, సర్వేయర్ వై.గిరితో పాటు మైన్స్ అధికారులు సదరు ప్రాంతాన్ని పరిశీలించారు. సచివాలయంలో గ్రామస్థుల నుంచి తవ్వకాలపై స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. అక్రమంగా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటా మని తవ్వకందారులను హెచ్చరించారు. అలాగే పెంటిభద్ర రోడ్డులో కుంకుమ సాగరం చెరువులో కూడా అక్రమ తవ్వకాలపై అధికారులు పరిశీలించారు. రెండు చెరువులపై ప్రస్తుత స్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని వారు తెలిపారు.


సచివాలయంలో గ్రామస్థుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్న రెవెన్యూ బృందం

శిథిలావస్థలో కాలువలు



శివశంకర్ కాలనీ వీధి చివరలో ప్రమాదకరంగా ఉన్న కాలువ, రోడ్లు

పాతపట్నం: పట్టణంలోని శివశంకర్ కాలనీలో కాలువలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. వీధుల చివరలో కాలువలు, సీసీ రోడ్లు పాడై కల్వర్టు ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదకరంగా ఉన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం కలుగుతుందోనని వారు ఆందోళన చెందు తున్నారు. జల్‌జీవన్ పనుల్లో భాగంగా సీసీ రోడ్లను తవ్వడంతో కాలువలు పాడయ్యాయి. పనులు పూర్తయిన తరువాత ఎటువంటి మరమ్మతులు చేపట్టలేదని స్థానికులు పేర్కొంటున్నారు. అసలే అంతంతమాత్రంగా ఉన్న రోడ్లను ఇలా తవ్వి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పలాసరూరల్: పంచాయతీలోని సమస్యలను పరిష్కరించాలని రెంటికోట గ్రామ ప్రజలు కోరారు. ఈ మేరకు సోమవారం పంచాయతీ కార్యదర్శి సద్గుణరాజు, సర్పంచ్ ఎస్.తిరుమలరావుకు వినతి పత్రం అందజేశారు. వీధి దీపాలు వెలగడం లేదని, శానిటేషన్ పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వ్యాధులు వ్యాపించకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని, బ్లీచింగ్ చల్లాలన్నారు. గ్రామస్థులు వేణు యాదవ్, కె.ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి సాయం

వజ్రపుకొత్తూరు: నారాయణపురం గ్రామానికి చెందిన జుత్తు పూజ అనే విద్యార్థినికి కళాశాల ఫీజు నిమిత్తం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ప్రతి నిధులు సోమవారం అందించారు. పేదరికంతో పాటు విద్యార్థిని తండ్రి, సోదరుడు మృతి చెందడంతో ఫీజు కట్టేందుకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని ఈ సాయం చేసినట్లు తెలిపారు.

ఎరువుల పంపిణీ

నందిగాం: దిమిలాడ పీఏసీఎస్ కేంద్రమైన నర్సిపురంలో ఎరువులను సోమవారం రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు పి.అజయ్‌కుమార్, పి.చంద్రశేఖర్, ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ సాగునీరు, ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచుతోందన్నారు. కార్యక్రమంలో సీఈవో కోటి, నాయకులు ఎం.లోకనాథం, ఎస్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలి

నందిగాం: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాలు సూచించాయి. సోమవారం స్థానిక ఎమ్మార్సీలో ఎంఈవో జి.నర్సింహులు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఉపాధ్యాయుల సర్దుబాటుపై పలు సూచనలు చేశారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు

● సర్వశిక్షా అభియాన్ సీఎంవో ప్రభాకరరావు

పెద్దకొల్లివలస(ఎల్.ఎన్.పేట): పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని సర్వశిక్షా అభియాన్ సీఎంవో పి.ప్రభాకరరావు స్పష్టంచేశారు. పెద్దకొల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన అమలును సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రత్యేక పోషక విలువలున్న పదార్థాలను పెట్టాలని సూచించారు. వంట ఏజెన్సీలు వంటలు చేసేటప్పుడు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలన్నారు. భోజనంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వస్తే వంట ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంఈవోలు సీహెచ్ మణికుమార్, కె.చంద్రమౌళి, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముగిసిన శిక్షా సప్తాహ్

జలుమూరు: జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాల ల్లో వారంరోజులుగా నిర్వహించిన శిక్షా సప్తాహ్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. చివరిరోజు శుభ్ దిన్‌భోజ్ సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో సోమవారం శుభదిన్ భోజ్ సహపంక్తి భోజనాలు నిర్వహించారు. దాతలు సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టారు. జలుమూరు ప్రభుత్వ బాలికల, లింగాలవలస ఉన్నత పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని ఎంఈవోలు బి.మాధవరావు, రవిప్రసాద్ పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజనాలు చేశారు. హెచ్ఎంలు ఇప్పిలి వేణుగోపాలరావు, ఉంగటి అప్పలసూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


జలుమూరులో సహపంక్తి భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈవోలు

● పలాసరూరల్: బొడ్డపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం శుభతిథ్ భోజన్ కార్యక్రమం చేపట్టారు. పాఠశాల చైర్మన్ సార జోగారావు, తెలుగు యువత అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, ఉపాధ్యాయులు, ఎన్‌డీఏ నాయకులు బొడ్డ దుష్యంత్, పి.చిరంజీవి, సాలిన ప్రవీణ్, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

● నరసన్నపేట: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం శుభతిథ్ భోజన్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. పాఠశాలల్లో గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడు అన్నారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రెడ్డికపేటలో భోజనాలు చేపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు


● సంతబొమ్మాళి: దండుగోపాలపురం జడ్పీ ఉన్నత పాఠశాలల్లో శిక్షా సప్తాహ్‌లో భాగంగా సోమవారం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలు చేశారు. రోజువారి మధ్యాహ్నం భోజనంతో పాటు విద్యార్థులకు అదనంగా కూర, అరటి పండ్లను క్రాఫ్ట్ టీచర్ కొన్న మార్కండేయులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కోత చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ● నందిగాం: పాఠశాలల్లో శిక్షాసప్తాహ్‌లో భాగంగా సోమవారం సహపంక్తి భోజనాలను నిర్వహించారు. జాతీయ విద్యావిధానం వార్షికోత్సవంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో చేపట్టిన కార్యక్రమాలపై సమావేశాలు నిర్వహించి సూచనలు చేశారు.

● మెదుళ్లవలస(పోలాకి): పాఠశాలల్లో గడచిన వారం రోజులుగా చేపడుతున్న శిక్షా సప్తాహ్ ముగింపు కార్యక్రమం సోమవారం ముగిసింది. స్థానిక ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కె.లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఫ్రెడరిక్‌ను సత్కరించారు. ఈ శిక్షా సప్తాహ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలలో భాగస్వామ్యం చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ సుంకాన శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. గొల్లలవలస ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓ-2 లింగరాజు, స్థానిక పెద్దల సమక్షంలో సప్తాహ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ● వజ్రపుకొత్తూరు: శుభతిథ్ భోజన్‌లో భాగంగా సోమవారం పలు పాఠశాలల్లో విద్యార్థులు, గ్రామపెద్దలు, గ్రామస్థులు, ఉపాధ్యాయులు సహపంక్తి భోజనాలను చేశారు. పాఠశాల కార్యక్రమాల్లో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడం ఈ కార్యక్రమ ఉద్దేశమని వజ్రపుకొత్తూరు హైస్కూల్ హెచ్ఎం తారకేశ్వర పండా తెలిపారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రిటైర్డ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి ఫ్రెడరిక్‌కు సత్కరిస్తున్న దృశ్యం

పాలిటెక్నిక్‌లో కామర్స్

● డీసీసీపీ కోర్సుతో ఉపాధి అవకాశాలు ● రేపు స్పాట్ అడ్మిషన్లు



కంప్యూటర్ శిక్షణలో డీసీసీపీ విద్యార్థులు

ఎచ్చెర్ల: శ్రీకాకుళంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లమో ఇన్ కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ (డీసీసీపీ) కోర్సులో చేరితే ప్రస్తుతం మార్కెట్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయని అధ్యాపకులు చెబుతున్నారు. ఇప్పటి వరకు పాలిటెక్నిక్‌లో టెక్నికల్, నాన్ టెక్నికల్ కోర్సులు మాత్రమే ఉండేవి. తాజాగా కామర్స్‌ను ప్రవేశపెట్టారు. ఈ మేరకు బుధవారం డీసీసీపీ కోర్సులో చేరేందుకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నారు.

● **బోధించే సబ్జెక్టులు:** ఇంటర్‌లో సీఈసీలో కామర్స్‌తోపాటు ఎంఎస్ ఆఫీస్, టాలీ, డీటీపీ, మల్టీమీడియా, సి లాంగ్వేజ్, విజువల్ బేసిక్ తదితర కంప్యూటర్ సబ్జెక్టులు, టైప్ రైటింగ్, షార్ట్ హేండ్ సబ్జెక్టులు కూడా బోధిస్తారు. టైప్ రైటింగ్ హయ్యర్ గ్రేడ్‌కు సంబంధించి ఏపీ సాంకేతిక శిక్షణ మండలి గుర్తింపు పొందింది. ఈ కోర్సు దేశమంతా చెల్లుబాటవుతుంది.

● **ఉన్నత విద్యావకాశాలు:** డీసీసీపీ పూర్తిచేసిన విద్యార్థులు బీకాం రెండో సంవత్సరంలో నేరుగా ప్రవేశం పొందవచ్చు. వృత్తి విద్యా కోర్సులైన సీఏ, ఐసీడబ్ల్యూఏ, సీఎస్, బీఎల్, బీబీఎం తదితర కోర్సుల్లో చేరవచ్చు.

● **స్టయిఫండ్‌తో కూడిన అప్రెంటీషిప్:** డీసీసీపీ పూర్తిచేసిన అభ్యర్థులకు ఎన్ఎండీసీ, హెచ్‌పీసీఎల్, బీహెచ్ఈఎల్, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, ఇస్రో వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో స్టయిఫండ్‌తో కూడిన ట్రైనింగ్ ఇవ్వనున్నారు.

● **ఉపాధి అవకాశాలు:** ఈ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రభుత్వ, ప్రైవేటురంగ సంస్థల్లో టైపిస్టుగా, క్లర్కులుగా, కంప్యూటర్ ఆపరేటర్లుగా, స్టెనోగ్రాఫర్లుగా ఉద్యోగాలు పొందవచ్చు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, ఏపీపీఎస్సీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డ్, బ్యాంకులు, వివిధ ప్రభుత్వ రంగ సంస్థలు, ప్రైవేటు రంగ ఇన్సూరెన్స్ కంపెనీలు, ఇస్రో, బెల్ తదితర సంస్థలు నిర్వహించే పోటీపరీక్షలు రాసేందుకు వీలుంది.

కోర్సులో చేరే విధానం...

పదో తరగతి ఉత్తీర్ణులై పాలిసెట్ రాయని విద్యార్థులు కూడా డీసీసీపీ కోర్సులో చేరవచ్చని శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల డీసీసీపీ కోర్సు విభాగాధిపతి డాక్టర్ ఎంఎల్ కామేశ్వరి తెలిపారు. బుధవారం 9.30 గంటలకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని చెప్పారు. ఒరిజనల్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం నిర్ధేశించిన ఫీజును తీసుకొని స్పాట్ అడ్మిషన్లకు హాజరుకావాలని కోరారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని డీసీసీపీ కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు ఫోన్ నెంబర్లు 94401 28522, 86391 39215కు సంప్రదించాలని తెలిపారు.

అసభ్యకర మెసేజ్‌లపై పోలీసుల దర్యాప్తు

పొందూరు: పొందూరులోని ప్రభుత్వోన్నత పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా బినామీ ఉద్యోగం చేస్తున్న ఓ వ్యక్తిపై సోమవారం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సదరు బినామీ ఉద్యోగి పాఠశాలలో కొంతమంది విద్యార్థునులకు ఫోన్ ద్వారా వాట్సాప్‌లో అసభ్యకర మెసేజ్‌లు పంపించడం తదితర విషయాలపై ఉపాధ్యాయినులు పేరుతో ఎస్పీకి ఫిర్యాదువెళ్లింది. దీంతో దర్యాప్తుచేయాలని పొందూరు ఎస్ఐను ఎస్పీ ఆదేశించారు. ఇదేవిషయం పాఠశాలకు వచ్చిన టీడీపీ నాయకుల దృష్టికి కొంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థినులు తీసుకువెళ్లారు. కాగా ఒకసారి సదరు ఉద్యోగిని మందలించామని హెచ్ఎం పి. వెంకటరావు తెలిపారు.అయినా మళ్లీ అసభ్యకర మెసేజ్‌లు పెడుతుండడంతో ఫిర్యాదు వెళ్లిందని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

బూర్జ: మండలంలోని డొంకలపర్త జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో పాలకొండ మండలంలోని బుక్కూరుకు చెందిన రాము గాయపడ్డాడు. సోమవారం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జంక్షన్ వద్ద ఉన్న గోతిలో పడిపోవడంతో కాలికి తీవ్రగాయాలయ్యాయి. దీంతో అయన్ను పాలకొండ ఏరియా ఆసుపత్రికి తరలించారు. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు.

'మీకోసం'లో 58 వినతులు



బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 58 వినతులొచ్చాయి. బాధితులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి ముఖాముఖిమాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సమస్యలపై సంబంధించిన పోలీసు అధికారులకు ఎస్పీ ఫోన్ చేసి చట్ట ప్రకారం న్యాయం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కోటబొమ్మాళికి చెందిన తెంబూరు సూర్యారావు తన యూనియన్ బ్యాంక్ అకౌంట్ హ్యాక్ చేసి 1.54 లక్షలు కాజేశారని ఎస్పీకి ఫిర్యాదు చేశాడు.

ప్రజలతో సంబంధాలు కలిగిఉండాలి

గార: పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సోమవారంరాత్రి గార పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మండలంలో శాంతిభద్రతల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌కు ఫిర్యాదుతో వచ్చే మహిళలు, పిల్లలకు, ప్రాధాన్యం ఇస్తూ వారి సమస్య పరిష్కారం తర్వాత ఇతరుల సమస్యలు పరిష్కారం కోసం చర్యతీసుకోవాలని కోరారు. స్టేషన్‌లో రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు.

అలేఖ్ గురువు కాశ్యపదాస్ బాబా మృతి



కాశ్యప్ దాస్‌బాబా (ఫైల్)

కంచిలి: తలతంపరలో నివాసముంటున్న అలేఖ్ గురువు కాశ్యపదాస్ బాబా మృతి మృతిచెందారు. ఒడిశా నుంచి ఇక్కడకు వచ్చి అలేఖ్ ఆశ్రమాన్ని నెలకొల్పినట్లు స్థానికులు చెబుతున్నారు. చెడు వ్యసనాలకు బానిసలై, లక్ష్యం లేకుండా తిరుగుతున్న స్థానిక యువతకు తన బోధనలతో మంచి మార్గంలో పయనించేలా కృషిచేశారని పేర్కొంటున్నారు. గ్రామస్థులతోపాటు పరిసర ప్రాంతాల్లో అలేఖ మహిమ పేరిట బోధనలు చేస్తూ ప్రజల్లో శాంతిని బోధించడమే కాకుండా సన్మార్గంలో నిలిపిన వ్యక్తిగా పేరుపొందారు. పరిసర గ్రామాల నుంచే కాకుండా ఒడిశాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ఆయన శిష్యులు మృతదేహాన్ని సందర్శించారు. శిష్యులు శూన్యవాసి, రామచంద్ర తదితరులు ఆధ్వర్యంలో అలేఖ నిబంధనలతో అంతిమ సంస్కారాలు తలతంపరలోని ఆయన ఆశ్రమం ప్రాంగణంలో నిర్వహించారు.

పూడికతీత పనులు వేగవంతం చేయాలి: కమిషనర్

శ్రీకాకుళం అర్బన్: నగర సుందరీకరణలో భాగంగా చేపట్టిన పూడికతీత పనులు వేగవంతం చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఒబులేసు కాంట్రాక్టర్లు, ఇంజినీర్లకు ఆదేశించారు. సోమవారం శ్రీకాకుళంలో 28 ప్రధాన కాలువలకు సంబంధించి జరుగుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కాంట్రాక్టర్లతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. వారంరోజుల్లోగా పూడికతీత పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు ఆదేశించారు.

ఇంటి వద్దే లబ్ధిదారులకు పింఛన్

నగరపాలక సంస్థ పరిధిలోని జూలైకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ లబ్ధిదారులకు ఇంటి వద్దనే అందజేస్తామని కమిషనర్ చల్లా ఒబులేసు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలో విలే కరులతో మాట్లాడుతూ ఆగస్టు ఒకటో తేదీన పింఛన్‌లబ్ధిదారులు ఇంటివద్దనేఉండాలని, సచివాలయ సిబ్బంది ఉదయం ఐదు గంటలకు వచ్చి ఇస్తారని చెప్పారు.

జ్యూట్ బ్యాగ్స్ విత్ స్క్రీన్ ప్రింటింగ్‌పై శిక్షణ

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని బ్యాంకర్స్‌కాలనీలో గల సత్యసాయి సేవా సమితి సాయి బృందావనంలో గల శాశ్వత స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో సత్యసాయి సేవా సమితి సాయి రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణరావు జ్యూట్ బ్యాగ్స్ విత్ స్క్రీన్ ప్రింటింగ్‌పై 40 రోజుల ఉచిత శిక్షణ సోమవారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కమలా త్రివేణి, సూర రామచంద్రరావు, కె.నాగప్రసాద్, అమ్మాజీ పాల్గొన్నారు.

నీరజా సుబ్రహ్మణ్యానికి నాట్య వరిష్ట పురస్కారం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళంలోని శ్రీ అభినయనృత్య నికేతన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ నీరజా సుబ్రహ్మణ్యానికి నాట్య వరిష్ట పురస్కారం లభించింది. సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి ఆలయం, విజయవాడ మువ్వగోపాల కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహణలో సింహాచలం దేవస్థానం ప్రాంగణంలో సంగీత నృత్య నీరాజనం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నీరజా శిష్యబృందం గాయత్రి, లావణ్య, శ్రీహర్షిత, శ్రీమేఘన, విశిష్ట తదితర 30 మందినృత్యాలు ప్రదర్శించారు. అనంతరం పురస్కారం అందజేశారు.

తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్: శ్రీకాకుళంలోని టౌన్‌హాల్‌లో సోమవారం రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికలను నిర్వహించారు. జూనియర్ బాలికల అండర్-42 కేజీల విభాగంలో బండి శిరీష, 68 కేజీల పైబడిన వారిలో శిమ్మనవ్య, అండర్-68 కేజీల విభాగంలో జి.దుర్గా భవానీ,బాలుర విభాగంలో డి.లక్షయ్‌కుమార్ (42కేజీలు), ఆర్.వెంకట ప్రీతమ్ (అండర్-59) ఎంపికయ్యారు. న్యాయనిర్ణేతలుగా తైక్వాండో గౌతమ్, సాయి బాలాజి, గణసాయిలు వ్యవహరించారు. కోచ్‌లు నవీన్, లక్ష్మణ్, జోగిపాటి వంశీ పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులకు రాష్ట్రస్థాయి పోటీలు వచ్చేనెల తొమ్మిది, పదో తేదీల్లో జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను పాల్గొన్నారు.

యూత్‌క్లబ్ మాజీ అధ్యక్షుడి మృతికి సంతాపం

పొందూరు: పొందూరుకు చెందిన యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ మాజీ అధ్యక్షుడు అనకాపల్లి రేవతిరావు (72) సోమవారం మృతిచెందారు. యంగ్‌స్టార్స్ యూత్‌క్లబ్ అధ్యక్షుడిగా మూడుసార్లు పనిచేశారు. ఈమేరకు రేవతిరావు మృతికి పలువురు సంతాపం తెలిపారు.

మట్టి తవ్వకాలపై అధికారుల దాడులు

ఎచ్చెర్ల: మండలంలోని చిలకపాలెం పంచాయతీలో నారాయణపురంలో అక్రమంగా మట్టితవ్వి ఇతర ప్రాంతాలకు తరలిస్తుండడంతో అధికారులు సోమవారం దాడులు చేశారు. వివిధ గ్రామాలకు గ్రావెల్ తరలిస్తుండడంపై సమాచారం మేరకు ఇచ్‌చార్జి తహసీల్దార్ ఎం.చక్రవర్తి, మైన్స్ ఇన్‌స్పెక్టర్ మణిక్యాలరావు, ఎస్ఐ ఎస్.చిరంజీవులు తవ్వుతున్న స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా చక్రవరి మాట్లాడుతూ జేసీ ఆదేశాల మేరకు మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని ఎక్కడ త్వవకాలు జరుగుతున్నాయో తెలుసుకున్నామన్నారు. ఆ స్థలం వద్దకు వెళ్లే సరికి ఆరు లారీలు, ఒక యంత్రం, రెండు ట్రాక్టర్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. త్వవకాలకు మైన్స్ శాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవని చెప్పారు. తవ్వకం జరుగుతున్న భూమి ఎవరిదో వాహన యజమానుల నుంచి వివరణ తెలుసుకుని వాస్తవ పరిస్థితిని జిల్లా అధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు.

అన్న క్యాంటీన్ పనులను పూర్తి చేయాలి

● ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్



ఆమదాలవలసలో అన్నక్యాంటీన్ పనులు పరిశీలిస్తున్న రవికుమార్

ఆమదాలవలస: అన్నక్యాంటీన్ పనులను త్వరగా పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని మునిసిపల్ ఏఈ అప్పలనాయుడును ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి కుమార్ ఆదేశించారు. సోమవారం పట్టణంలోని రైతు బజారు పక్కనఉన్న అన్న క్యాంటీన్ భవనం పనులు పరిశీలించారు. ● ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు ప్రభుత్వం నూతన బస్సులను ప్రారంభి స్తోందని ఎమ్మెల్యే కూన రవికుమార్ తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద శ్రీకాకుళం-బత్తిలి ఆర్టీసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా అనుమతి లేకుండా పట్టణ శివారులోని ఫ్లైఓవర్ దిగువన వైఎస్సార్ విగ్రహం నెలకొల్పారని,త్వరలో తొలగించి ప్ర యాణికులకు ఇబ్బంది లేకుండా చూస్తామని రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజర్లు శర్మ,మల్లిఖార్జునరాజు, ఆర్టీసీ మేనేజర్ గంగరాజు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు సంపతిరావు మురళి, కూన భానోజీరావు, అప్పలనాయుడు, తంగి గురయ్యనాగళ్ల మురళీధర్, గుడ్ల దుర్గా ప్రసాద్, శెట్టి పద్మ,పాతిన రమణమూర్తి, గరుగుబెల్లి నాగేశ్వరరావు, రెడ్డి రాంబాబు, కింజరాపు శివ పాల్గొన్నారు.

●**సరుబుజ్జిలి:** మండలంలోని పెద్దసవలాపురం, వీరమల్లిపేట, సిందువాడ తెలుగు యువత నాయకులు భాస్కర్, బుజ్జి, పార్వతీశం ఎమ్మెల్యే కూన రవి కుమార్‌కు అభినందించారు.ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందడంతో కేరళలో ప్రసిద్ధిచెందిన కలప చెక్కపై రవికుమార్ చిత్రాన్ని చెక్కించి ఉన్న ఈ ప్రత్యేక బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి సురేష్, తర్లాడ సురేంద్ర పాల్గొన్నారు.

విద్యాభివృద్ధే ధ్యేయం

● ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్



విద్యార్థినులకు పుస్తకాలు అందజేస్తున్న అశోక్

ఇచ్ఛాపురం: విద్యాభివృదే టీడీపీ కూటమి ధ్యేయమని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ తెలిపారు. సోమవారం ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ వరద శంకరరావు అధ్యక్షతన ఇంటర్ టెస్ట్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు.అనంతరం కళాశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు.కార్యక్రమంలో జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జిలు దాసరి రాజు, బుద్దాల నిర్మలారెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్ష కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందికి జాని, కౌన్సిలర్లు పత్రి తవిటయ్య, కాళ్ల దిలీప్, ఆశి లీలారాణి, నాయకులు డిల్లీరావు, దుర్యోధనరెడ్డి, కాళ్ల జయదేవ్, నాగరాజుపాత్రో, రెయ్యి జానకిరావు, సహదేవ్‌రెడ్డి, కామేష్, పద్మనాభం, చిన్నా పాల్గొన్నారు. కాగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన పురుషోత్తపురానికి చెందిన గాలి కృష్ణారావును ఎమ్మెల్యే పరామర్శించారు.

ప్రభుత్వ విద్య బలోపేతం చేయాలి

శ్రీకాకుళం రూరల్: ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడమే శిక్షా సప్తాహ్ ఉద్దేశమని నియోజకవర్గ టీడీపీ తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వాతిశంకర్ తెలిపారు. సోమవారం రూరల్ మండలంలోని కిష్టప్పపేట ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు తిథిభోజనాలను అందజేశారు. కార్యక్రమంలో సత్యవతి, హెచ్ఎం బి.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **శ్రీకాకుళం అర్బన్:** జాతీయ విద్యావిధానంలో భాగంగా విద్యాభివృద్ధికి శిక్షా సప్తాహ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు అధినేత సూరశ్రీనివాసరావు తెలిపారు. ఈమేరకు శ్రీకాకుళంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు తిథి భోజనాలను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎం.గోవిందరావు పాల్గొన్నారు.

●**ఇచ్ఛాపురం:** కొళిగాం జడ్పీ పాఠశాలలో 400మంది విద్యార్థులకు భోజనాలు ఏర్పాటుచేశారు. ధర్మపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాధం 300మంది విద్యార్థులకు తయారు చేసి పాయసం అందించారు.

●**ఎచ్చెర్ల:** ముద్దాడ ప్రాధమిక పాఠశాలలో శుభదిన్ భోజన కార్యక్రమం నిర్వహించారు.హెచ్ఎం మణిపాత్రుని నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అమరావతి గణపతి రావు, పోలం అప్పారావు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

కృషితోనే సభ్యత్వ నమోదు విజయవంతం

ఇచ్ఛాపురం: క్రియాశీల వలంటీర్లు, జనసైనికులు, వీరమహిళలు కృషితోనే క్రియాశీల సభ్యత్వ నమోదు విజయవంతమయ్యిందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు తెలిపారు. జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు కార్యక్రమంపై ఆపార్టీ పీఏసీ చైర్మన్‌నాదేండ్ల మనోహర్, ప్రధానకార్యదర్శి నాగబాబు నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా క్రియాశీల సభ్యత్వాల నమోదులో ఇచ్ఛాపురం నియోజకవర్గం 9500 నమోదుకు చేరడంతో దాసరి రాజుకు అభినందించారు.

కృష్ణమూర్తికి రోటరీ సేవశ్రీ అవార్డు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురానికి చెందిన రొటేరియన్ దక్కత కృష్ణమూర్తిరెడ్డికి రోటరీ సేవశ్రీ అవార్డుకు ఎంపిక చేశారు. ఈమేరకు విశాఖలో ఇటీవల రోటరీ ఇంటర్‌నేషనల్ డైరెక్టర్ రాజు సుబ్రహ్మణ్యం, రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు కృష్ణమూర్తికి అవార్డు అందజేశారు.

రెన్యువల్ చేయించి ఆదుకోండి

ఇచ్ఛాపురం: తమకు రెన్యువల్‌చేయించి ఆదుకోవాలని గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్లు కోరారు. ఈమేరకు ఎమ్మెల్యే అశోక్‌కు ఇచ్ఛాపురంలోని బాలికల జూనియర్ కళాశాలలో గెస్ట్, కాంట్రాక్ట్ లెక్చరర్లగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వినతిపత్రం అందజేశారు. విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు కావస్తున్నా, రెన్యువల్ చేయకపోవడంతో వేతనాలు అందడంలేదని వాపోయారు. కార్యక్రమంలోగెస్ట్‌లెక్చరర్లు డి.మమత, త్రినాథరావు, డిల్లేశ్వరి, శివప్రసాద్, జానికిరావు, దేవి పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఎచ్చెర్ల: విద్యారంగ సమస్యలపై ఎచ్చెర్ల ఎంఈవో కె.పున్నయ్య, తహసీల్దార్ ఎం.చక్రవర్తిలకు సోమవారం యూటీఎఫ్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, నాయకులు గొంటి సురేష్, రాము, విశ్వనాధం, బి.రమేష్, సీహెచ్‌రామారావు, పి.మల్లేశ్వరరావు, ఎస్పీ వెంకటరమణ పాల్గొన్నారు.

పాలిచ్చే తల్లులకు ప్రత్యేక గది: కలెక్టర్



ప్రత్యేక గదిని ప్రారంభించిన కలెక్టర్

కలెక్టరేట్: పాలిచ్చే తల్లులకు ప్రత్యేక గది అవసరమని కలెక్టర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ తెలిపారు. సోమవారం మీకోసం కార్యక్రమానికి వచ్చే పాలిచ్చే తల్లులు, జడ్పీలో పని చేసే ఉద్యోగినులకు ఉపయోగపడేలా జడ్పీ సమావేశ మందిరంలో ప్రత్యేకంగా ఓ గదిని కలెక్టర్‌ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బేటీ బచావో-బేటీపడావో పథకం కింద ఈగదులు తెరిచినట్లు తెలిపారు. శ్రీకాకుళం,టెక్కలి, పలాస,నరసన్నపేట ఆర్టీసీబస్టాండుల్లో గదులు త్వరలో ప్రారంభిస్తామని చెప్పారు.కార్యక్రమంలో జేసీ ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

టిడ్కో లబ్ధిదారులపై వడ్డీ భారం తగదు

● జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన



జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు

కలెక్టరేట్: శ్రీకాకుళం మండలంలోని పాత్రునివలస సమీపంలో గల టిడ్కో గృహాలకు సంబంధించి బ్యాంకు యాజమాన్యాలు లబ్ధిదారులపై అధిక వడ్డీ భారం వేయడం తగదని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.యుగంధర్, కొన్న శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో వారు బాధితులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. అనంతరం జడ్పీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం జోక్యం చేసు కుని వడ్డీ లేని రుణాలు మంజూరు చేసి లబ్ధిదారులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో టిడ్కో లబ్దిదారులు శ్రీకాంత్, మీనా, రమాదేవి,ర సంతోష్ పెద్ద ఎత్తున లబ్దిదారులు పాల్గొన్నారు.

సింగుపురంలో వాహనాల తనిఖీ

శ్రీకాకుళం రూరల్: సింగుపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద సోమవారం రాత్రి పెద్దపాడు పోలీసు స్టేషన్ ఎస్ఐ వాసుదేవరావు వాహనాల తనిఖీలు నిర్వహించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

గుజరాతీపేట: చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన అవసరమని సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు తెలిపారు. సోమవారం శ్రీకాకుళంలోని కోర్టు ఆవరణలో న్యాయ సేవ భవన్‌లో న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వగతి, స్వాతి స్వచ్ఛంద మహిళా సంస్థలు ప్రజలకు దగ్గరగా వారి స్థితిగతులను చూస్తున్నాయని, మహిళల సమస్యలను నేరుగా న్యాయసేవాధికార సంస్థ వద్దకు వెళ్లి పరిష్కరిచుకోవడానికి చక్కటి మార్గం చూపుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో డీసీపీవో కేవీరమణ, సీడబ్ల్యుసీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, స్వీప్ డైరెక్టర్ కె.రమణమూర్తి, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మిషన్ లెర్నింగ్‌పై అవగాహన

ఎచ్చెర్ల: మిషన్ లెర్నింగ్‌పై డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్శిటీ ఇం జినీరింగ్ కళాశాల సీఎస్‌సీ విభాగం అధ్యాపకులు జి.రామకృష్ణ అవగాహన కల్పించారు. సోమవారం విశ్వవిద్యాలయం రీసెర్చ్ ఫోరం ఆధ్వర్యంలో వర్శిటీ సెమినార్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు.సమావేశంలో రీసెర్చ్ ఫోరం నిర్వాహకులు ఎన్.సంతోష్ రంగనాథ్, ఎస్.మధులత పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

● ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్



ఆమదాలవలస ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆమదాలవలస: మాదక ద్రవ్యాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మొజ్జాడ యుగంధర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొన్న శ్రీనివాసరావు కోరారు. సోమవారం ఆమదాలవలస ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి రైల్వేస్టేషన్ జంక్షన్ వరకు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేష్ మాట్లాడుతూ మత్తుపదార్థాలుఅరికట్టడానికి తాము కూడా ముందుంటామన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు సింహాచలం, కూర్మయ్య, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యపకులు, విద్యార్థులు, పోలీసులు పాల్గొన్నారు.

కుక్కల తరలింపు



ఆసుపత్రిలో కుక్కలను పట్టుకొని తరలిస్తున్న సిబ్బంది

అరసవల్లి: శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సంచరిస్తున్న కుక్కలను సంరక్షణ కేంద్రానికి తరలించారు.రోగులను భయభ్రాంతులకు గురిచేస్తున్న కుక్కలసంచారంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో జీజీహెచ్‌లో కుక్కలబెడద శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది.దీంతో మునిసిపల్ అధికారులుస్పందించి, సోమవారం ఆసుపత్రిలో కుక్కలను పట్టుకుని వాహనంలో కుక్కల సంరక్షణ కేంద్రానికి తరలించారు.

ధనవతికి స్వర్ణ నంది అవార్డు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురానికి చెందిన కళాకారిణి పెదిన ధనవతి స్వర్ణనంది అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని మెగా ఎంటర్‌ప్రైజెస్ ఎండీ శిరీషరెడ్డి ఆధ్వర్యంలో కళారంగంలో రాణిస్తున్న వారికి కళాకర్ సేవరత్న అవార్డులు అందించారు. ఈ మేరకు త్యాగరాజ ఆడిటోరియంలో ధనవతికి స్వర్ణనంది అవార్డును అందించి సత్కరించారు.

భవిత కేంద్రం పరిశీలన

ఇచ్ఛాపురం: ముత్యాలమ్మపేటలో గల భవిత కేంద్రాన్ని సమగ్ర శిక్ష ఐఈ కోఆర్డినేటర్ బి.గోవింద సోమవారం సందర్శించారు. కార్యక్రమంలో ఐఈ అసి స్టెంట్ కోఆర్డినేటర్ ఉమ, ఎంఈవో అప్పారావు, హెచ్ఎం శివకుమార్, సహిత ఉపాధ్యాయులు సూర్యం, సోమేష్ పాల్గొన్నారు.

ఏపీజీవీబీ బ్యాంకు తరలించవద్దు



బ్యాంకు శాఖను తరలించవద్దని కోరుతున్న కళింగపట్నం గ్రామస్థులు

కలెక్టరేట్: కళింగపట్నంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకును(ఏపీజీవీబీ) తరలివంచవద్దని ఆ గ్రామస్థులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు పంచాయతీ ప్రజల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ కళింగపట్నంలోనే కొనసాగేలా కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మిన మౌనిక రాణి, మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి, పెద్దలు తమ్మిన రాజు,పొట్నూరు వైకుంఠరావు పాల్గొన్నారు.

● **గార:** కళింగపట్నంలో నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకును తరలించే ఆలోచన విరమించుకొని కొన సాగించాలని పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ మేరకు సర్పంచ్ తమ్మిన మౌనిక రాణి, మాజీ సర్పంచ్ పొట్నూరు కృష్ణమూర్తి, పెద్దలు తమ్మిన రాజు, పొట్నూరు వైకుంఠరావు తదితరులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బ్యాంకు వల్ల బందరువానిపేట, కె.మత్స్యలేశం, కళింగపట్నం, వమరవెల్లి తోణంగి తదితర పంచాయతీ ప్రజలకు కూడా సేవలందుతున్నాయని తెలిపారు.

గ్యారేజీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

అరసవల్లి: రాష్ట్రంలోని 129 ఆర్టీసీ డిపోల్లో పనిచేస్తున్న గ్యారేజ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ (ఆర్టీసీ) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివి నరసయ్యలు సోమవారం తెలిపారు.ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, విభాగాల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గ్యారేజీల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరారు. సరికొత్త టూల్స్ ఏర్పాటుచేయాలని, స్పేర్ పార్ట్స్ సకాలంలో అం దించాలని, ఉద్యోగులకు విలీనం ముందు ఉన్న అన్ని రకాల అలవెన్స్‌లు, మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సిబ్బందికి శిక్షణ ఇప్పించాలని డిమాండ్ చేశారు.



ఆర్టీసీ ఎండీకి వినతిపత్రం ఇస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు